



గొల్లప్రోలులో పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహిస్తున్న సాయం అందుకున్న ముంపు బాధితులు

ఇదేంటి బాస్?

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కొందరు పోలీసుబాస్‌ల వ్యవహారశైలి మారడం లేదు. ఇంకా గత వైసీపీ ప్రభుత్వ వాసనలతోనే ఇంకా వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. దీనికి నిలువెత్తు ఉదాహరణే సీఐలు, ఎస్‌ఐల పోస్టింగ్‌ల వ్యవహారం. గత ప్రభుత్వంలో వైసీపీ ముఖ్యులు చెప్పినట్టల్లా తలూపిన కొందరు సీఐలు, ఎస్‌ఐలకు కొత్త ప్రభుత్వంలోనూ కీలక పోస్టులు దక్కగా, నిబంధనల ప్రకారం పనిచేసే సమర్థులుగా పేరు తెచ్చుకొన్న మరికొందరికి వీఆర్ బహుమానంగా ఇవ్వడం విమర్శలకు గురవుతోంది. ఇలా జరుగుతుందోనని బలవంతంగా వీఆర్‌లో ఉన్న పోలీసులకు అర్థం కావడం లేదు.



- పోలీస్‌శాఖలో గందరగోళంగా బదిలీల వ్యవహారం
- గత ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన కొందరికి ఏరికోరి పోస్టింగ్‌లు
- సమర్థవంతంగా పనిచేసిన మరికొందరికి పోస్టింగ్‌లు లేకుండా వీఆర్‌లోకి..
- ఉమ్మడి తూ.గో. జిల్లాలో 15మందికిపైగా వీఆర్‌లో కొనసాగుతోన్న సీఐలు
- 60మందికిపైగా ఎస్‌ఐలూ వీఆర్‌లో: ఏలూరు డీఐజీ పరిధిలో అత్యధికంగా తూ.గో.లోనే..
- ఒకపక్క పోలీసు బదిలీల్లో పారదర్శకతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- కానీ కిందిస్థాయిలో కొందరు బాస్‌లు ప్రత్యేక ఆసక్తులతో పోస్టింగ్ నిర్ణయాలు
- మూడునెలలుగా అనేకమంది సీఐ, ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఇంకా వీఆర్‌లోనే..
- మెట్టతో సహా కాకినాడ సిటీ, రామచంద్రపురం, పెద్దాపురంల్లో పోస్టింగ్‌లపై విమర్శలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

పోలీసుబదిలీల్లో సమర్థతకు పెద్దపీట వేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించినా కిందిస్థాయిలో కొందరు కీలక పోలీసుబాస్‌లు మాత్రం తమకు నచ్చినట్లు నిర్ణయాలు తీసుకుంటుండడం అనుమానాలకు తావిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడునెలలుగా 15మందికిపైగా సీఐలు, 60మందికిపైగా ఎస్‌ఐలను వీఆర్‌లో ఉంచేశారు. వీరిలో అనేకమంది ఏ వివాదాలతో సంబంధం లేకపోవడం విశేషం. మరికొందరికి కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు కూడా ఇచ్చారు.

అప్పుడు చెలరేగిపోయినా సరే..

పోలీసుశాఖలో అధికారుల బదిలీల వ్యవహారం గందరగోళంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పలువురు సీఐ, ఎస్‌ఐలకు ఎందుకు పోస్టింగ్ ఇస్తున్నారో, ఎందుకు వీఆర్‌లో ఉంచుతున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో వైసీపీకి అడ్డంగా కొమ్ముకాసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారికి కీలకస్థానాల్లో పోస్టింగ్‌లు లభించగా అప్పట్లో వేధింపులు, ఇబ్బందులకు గురై లూప్‌లైన్‌లో ఉన్నవారికి కీలక పోస్టింగ్‌లు దక్కడంలేదు. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా చెలరేగిన వారికే మళ్లీ ప్రాధాన్యత లభిస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనివెనుక కొందరు పోలీసు ఉన్నతాధికారులు, వారి వ్యక్తిగత సహాయకుల పాత్ర ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీరు ప్రత్యేక శ్రద్ధతో విమర్శలు ఎదుర్కొంటున్న వారికి మంచి పోస్టింగ్‌లు ఇప్పించి, కొందరిని ఏకారణం లేకుండా వీఆర్‌కే పరిమితం చేయడంలో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక ఏలూరు రేంజ్ పరిధిలో కీలక అధికారి కార్యాలయంలో కొందరు ఉన్నట్టు చర్చ జరుగుతోంది.

వివాదాలు లేకున్నా పోస్టింగ్ ఇవ్వరేం?

కాకినాడలో పనిచేస్తున్న ఓ ఇద్దరు సీఐలను అకస్మాత్తుగా వీఆర్‌కు పంపించేశారు. కానీ వీరిపై ఎలాంటి వివాదాలు లేవు. ఇందులో ఒకరికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవల స్పెషల్‌బ్రాంచ్‌కు పంపాల్సి ఉన్నా పోస్టింగ్ ఇవ్వకుండా తొక్కిపెట్టడం విశేషం. మరికొందరు సీఐలను మూడునెలలుగా వీఆర్‌లో ఉంచి పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంపై ఉమ్మడి తూ.గో.జిల్లాలో అధికార పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లా మెట్టప్రాంతం, కాకినాడ నగరం, పరిసర ప్రాంతాల్లో జరిగిన పోస్టింగ్ వ్యవహారాలు చర్చనీయాంశంగా మారాయి. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెట్ట ప్రాంతానికి కేంద్రంగా ఉన్న ఒక సర్కిల్‌లో సీఐగా పనిచేసిన అధికారి గత వైసీపీపాలనలో చెలరేగిపోయారు. అలాంటి సీఐకి అదే ప్రాంతానికి చేర్చి ఉన్న సర్కిల్‌లో సీఐగా పోస్టింగ్ ఇవ్వడం తీవ్ర దుమారం రేపుతోంది. అతడు గతంలో పనిచేసిన ప్రాంతాల్లో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అలాంటి వ్యక్తికి ప్రభుత్వం మారినా అధికారులు పోస్టింగ్ ఎలా ఇచ్చారనే చర్చ జరుగుతోంది. కాకినాడ నగరంలోని ఓ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన అధికారి గతంలో ఓ మహిళను ఈడ్చుకువెళ్లి పోలీసు జీపులో పడేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అతను అప్పట్లో అధికార వైసీపీకి అనుకూలంగా పనిచేసినట్లు పక్కా ఆధారాలు ఉన్నాయి. ఇతడికి ప్రభుత్వం మారాక కూడా కాకినాడ నగరానికి సమీపంలోని ఓ పట్టణ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పోస్టింగ్ ఇచ్చారు. గతంలో కాకినాడ నగరంలో పనిచేసిన సీఐ అనేక ఆరోపణలు ఎదుర్కొనగా, కూటమి ప్రభుత్వం రాగానే బదిలీ చేశారు. తిరిగి నెలలు గడవకుండానే మరో కీలక విభాగంలో సీఐ పోస్టింగ్ దక్కించుకున్నారు. కాకినాడ నగరంలోనూ, నగరానికి చేర్చి ఉన్న సీఐల పోస్టింగ్ వ్యవహారంలో రూ.10 లక్షలనుంచి రూ.15లక్షల వరకు భారీగా సొమ్ములు చేతులు మారాయి. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు అధికంగా జరిగే ఓ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, మరో సర్కిల్ పోస్టింగ్ విషయంలో రూ.25లక్షలకు పైగా చేతులు మారినట్లు సమాచారం. మరోపక్క తమకు నచ్చనివారికి వైసీపీ ముద్ర వేసి పోస్టింగ్‌లు దక్కకుండా కొందరు అధికారులు చక్రం తిప్పారు. కాకినాడ జిల్లాలో మెట్టప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే ఓ సీఐకి పోస్టింగ్ కోసం మూడు నెలలుగా పోరాటం చేస్తున్నారు. సదరు అధికారి గతంలో వైసీపీ నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు అతడికి పోస్టింగ్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచారు. ప్రస్తుతం ఏలూరు రేంజ్ పరిధిలో 48మంది సీఐలు వీఆర్‌లో కొనసాగుతున్నారు. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 15మంది, ఉమ్మడి పశ్చిమలో 18మంది ఉన్నారు. వీరిలో అనేకమంది సమర్థులు, ఏవివాదాలు లేకపోయినా వీరికి పోస్టింగ్ ఇస్తే తమకు ప్రయోజనం ఉండదనే కారణంతో వైసీపీ ముద్ర వేయడం విశేషం.

ఇదేం గందరగోళమో..

సామర్లకోటలో ఎస్‌హెచ్‌వోగా నియమితులైన సీఐ విషయంలో ఆరోపణలు రావడం, ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో రోజుల వ్యవధిలోనే అతడిని మార్చివేయడం పోస్టింగ్‌ల్లో గందరగోళానికి నిదర్శనంగా నిలుస్తోంది. కొందరు బాస్‌లు సమర్థత కాకుండా ఇతర అంశాలు చూస్తుండడంవల్ల గందరగోళంతో పోస్టింగ్‌లు నవ్వులపాలవుతున్నాయనే చర్చ జరుగుతోంది. బదిలీలను గతంలో ఒకటి లేదా రెండు డీవోలతో పూర్తి చేసేవారు. కానీ ఇప్పుడు విచిత్రంగా ఎవరికి వారికే ప్రత్యేక డీవో లేదా అటాచ్‌మెంట్ ఇచ్చి పంపించడం లేదా మౌఖిక ఉత్తర్వులతో కొత్త ప్రదేశాల్లో చేరమని చెప్పడం వంటి వ్యవహారాలు జరుగుతున్నాయి. ఇటీవల రామచంద్రపురం ఎస్‌ఐ నియామకం వ్యవహారం కూటమి ప్రభుత్వంలో ఓ మంత్రి, ఎమ్మెల్యే మధ్య చిచ్చుకు దారితీసింది. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా చెలరేగి టీడీపీ నేతలపై కేసులు పెట్టిన సదరు ఎస్‌ఐకి పోస్టింగ్ రావడం దుమారం రేపడంతో అప్పటికప్పుడు అతడిని వీఆర్‌కు పంపారు. ఎస్‌ఐల నియామాకంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60మంది వరకు ఇంకా వీఆర్‌లో ఉన్నారు. వీరిలో ఒక్క కాకినాడ జిల్లాలోనే 25మంది వరకు ఉన్నారు.

వరద సాయంపై... హర్షాతిరేకాలు

- ముంపు బాధితులకు భారీగా ఆర్థిక సాయం
- దెబ్బతిన్న 4657 గృహాలకు రూ.10వేల చొప్పున సొమ్ములు జమ
- జిల్లాలోని 18 మండలాల పరిధిలో బాధితులకు ఊరట
- పంట నష్టపోయిన 24879మంది రైతులకూ..
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు బాధితుల కృతజ్ఞతలు

గొల్లప్రోలు/పిఠాపురం/కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 25: ఎన్నడూ లేని విధంగా వరద ముంపు తగ్గిన రెండు వారాల వ్యవధిలోని ఆర్థిక సహాయం, నష్టపరిహారం అందడంతో వరద బాధితుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం బ్యాంకుల్లో డబ్బులు పడుతుండడంతో మహిళలు వాటిని డ్రా చేసుకునేందుకు బ్యాంకుల కస్టమర్ సర్వీసు పాయింట్లు వద్దకు చేరుతున్నారు. తమ జీవితంలో ఎన్నో వరదలు చూశామని, ఎప్పుడూ నగదు సాయం అందలేదని మహిళలు చెబుతున్నారు.

వేలమంది బాధితులు

జిల్లాలో ఏలేరు, పంపా, తాండవ జలాల వరద ప్రభావంతో పెద్దఎత్తున గృహాలు దెబ్బతిన్నాయి. ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా పిఠాపురం నియోజకవర్గంలో అపారనష్టంజరిగింది. వారంరోజులకుపైగా ముంపు కొనసాగడంతో రైతులు పంటలు పూర్తిగా నష్టపోయారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉదారంగా స్పందించింది. పరిహారాన్ని భారీగా పెంచారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా వరదల పరిస్థితిని పరిశీలించి వరదనీటిలో, బురదమయంగా మారిన రహదారుల్లో తిరిగి బాధితులకు అండగా ఉంటామని ప్రకటించారు. అన్నమాట ప్రకారం ప్రభుత్వం ప్రకటించిన ప్రతి ఇంటికి రూ.10వేల వంతున పరిహారం బ్యాంకు ఖాతాలకు బుధవారం జమయ్యాయి. జిల్లాలో 4657మంది బ్యాంకు ఖాతాల్లో రూ.10వేల చొప్పున జమ చేసింది. జిల్లాలో 18 మండలాల పరిధిలో 62 గ్రామాల్లో దెబ్బతిన్న గృహాల యజమానులకు ఈ సొమ్ము జమ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో వరదలవల్ల నష్టపోయిన గృహాలకు తూతూమంత్రంగా పరిహారం ఇచ్చి చేతులు దులుపుకునేది. దీనివల్ల అప్పట్లో వరద బాధితులు తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వంలో గృహాలు దెబ్బతిన్న బాధితులకు పరిహారం ఇవ్వడంలో ఉదారత చూపిందని బాధితులు అంటున్నారు.

పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం

ముంపునకు గురైన గృహాలకు పరిహారంగా రూ.10వేల వంతున నగదు జమకావడంతో గొల్లప్రోలు అరుందతీయపేట వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. తమకు సాయం అందించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతుల ఖాతాల్లోకి కూడా..

వరదలవల్ల పంటలు నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బుధవారం రాత్రి నుంచి సొమ్ములు పడడం ప్రారంభమైంది. జిల్లాలో 19 మండలాల పరిధిలో 34812 ఎకరాల్లో పంటలకు తీవ్రంగా నష్టం జరిగింది. దీనివల్ల 24879మంది రైతులు నష్టపోయారు. గతంలో ఎప్పుడూ ఇంత త్వరగా పరిహారం అందలేదని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముంపునకు గురైన గృహాలకు గత అయిదేళ్లలో ఒక్కసారీ పరిహారం ఇవ్వలేదని మహిళలు తెలిపారు.

15 వరదలు చూశా.. తొలిసారి సాయం అందుకున్నా



-వానపల్లి గన్నెమ్మ, మార్కండేయపురం, గొల్లప్రోలు

నా వయస్సు 65ఏళ్లు. ఇప్పటికి 15కిపైగా వరదలు చూశా. ఎప్పుడూ ధన సహాయం చేయలేదు. బియ్యం ఇచ్చి చేతులు దులుపుకునేవారు. ఈసారి మాత్రం బియ్యం, నిత్యావసర సరుకులు ఇచ్చారు. ఇప్పుడు రూ.10వేలు నా బ్యాంకు ఖాతాలో వేశారు. నీరు రావడంవల్ల పాడైన ఇంటిని మరమ్మతులు చేసుకోవడానికి ఈ మొత్తం పనికి వస్తుంది. ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు.

పరిహారం ఇచ్చి చేతల్లో చూపించారు..



-కోటిపల్లి జయ, అరుందతీయపేట, గొల్లప్రోలు

ప్రతిఏటా వరదల కారణంగా ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులకు గురవుతూనే ఉన్నాం. ఎప్పుడూ ఎటువంటి సహకారం అందేది కాదు. బియ్యం ఇచ్చి మళ్లీ కనిపించేవారు కాదు. ఈ సారి వరదల సమయంలో మా కష్టసుఖాలు పట్టించుకున్నారు. ఇప్పుడు రూ.10వేలు ఇచ్చారు. చేతల్లో సాయం చూపించిన ప్రభుత్వం ఇది.

బాధితులమని ప్రభుత్వం మొదటిసారి గుర్తించింది



-పెంకే చక్రమ్మ, మాధవపురం, పిఠాపురం మండలం

ఏలేరు వరదల వచ్చిన ప్రతిసారి ముంపునకు గురవుతున్నా మొదటిసారి ప్రభుత్వం మమ్మల్ని బాధితులుగా గుర్తించింది. ఈసారి మాత్రమే రూ.10వేల సాయం అందింది. గతంలో ఎప్పుడు ముంపునకు గురైనా నాయకులు, అధికారులు పరామర్శలు తప్ప గృహాలకు పరిహారం ఇవ్వలేదు. ఇదే తొలిసారి ఇవ్వడం.



పిఠాపురం పట్టణంలో భారీగా కురుస్తున్న వర్షం

మళ్లీ వర్షం

- జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వాన

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 25: పిఠాపురం పట్టణంలోని వరుసగా రెండో రోజు బుధవారం భారీవర్షం కురిసింది. ఉదయం 6గంటలు నుంచి 11 గంటల వరకూ వర్షం పడుతూనే ఉంది. వర్షంతో డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించింది. ప్రదాన రహదారులన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి, పాతపోలీసుస్టేషన్, ఫైర్‌స్టేషన్, రథాలపేట సెంటర్లు, పాతబస్టాండు, సినిమాసెంటర్, ఉప్పాడ బస్టాండు, చర్చి సెంటర్, మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్సు తదితర ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ రహదారిపై వర్షపునీరు ప్రవహించింది. అందులోనే వాహనదారులు రాకపోకలు సాగించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. గొల్లప్రోలు పట్టణంలోను భారీ వర్షం కురిసింది. వర్షంతో ఎక్కడిక్కడ డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించింది. విద్యార్థులు వర్షంలో తడుస్తూనే పాఠశాలలు, కళాశాలలుకు వెళ్లడం కనిపించింది.

మళ్లీ పెరుగుతున్న సుద్దగడ్డ

సుద్దగడ్డ వరద మళ్లీ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవడంతో వరద నీరు సుద్దగడ్డకు చేరుతోంది. దీంతో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ(కొండ)కాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపైకి వరద నీరు చేరింది. దీనితో మోకాలిలోతు నీటిలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు దగ్గరుండి నీటిని దాటిస్తున్నారు.

జిల్లాలో 898.0 మి.మీ వర్షపాతం నమోదు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 25: జిల్లాలో గడచిన 24 గంటల్లో 42.8 మి.మీ. సరాసరితో మొత్తంగా 898.0 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తాళ్లరేవు మండలంలో 160.4మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా రౌతులపూడి మండలంలో 2.4 మి.మీ. వర్ష పాతం నమోదైంది. మండలాలవారీగా వర్షపాతం వివరాలు మి.మీ.లలో.. కాజులూరు 128.8, పిఠాపురం 63.2, గండేపల్లి 53.2, తుని 49.8, ఏలేశ్వరం 49.2, కరప 42.0, పెదపూడి 38.4, శంఖవరం 36.6, జగ్గంపేట 36.4, తొండంగి 33.8, కోటనందూరు 32.2, ప్రత్తిపాడు 28.4, కిర్లంపూడి 26.4, సామర్లకోట 22.8, పెద్దాపురం 21.2, గొల్లప్రోలు 19.8, కాకినాడఅర్బన్ 19.4, రూరల్ 18.2, కొత్తపల్లి 15.4మి.మీ. వర్షం కురిసింది.

సామర్లకోటలో భారీ వర్షం

సామర్లకోట, సెప్టెంబరు 25: సామర్లకోట పట్టణంలోనూ, మండలంలోనూ బుధవారం ఎడతెరిపిలేకుండా భారీవర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా ముంపు బెడదను ఎదుర్కొంటున్నాయి. చిన్నచిన్న కాలువలే కాకుండా పెద్ద డ్రైన్లు సైతం పొంగి ప్రవహించాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నెంబరు-2 మార్కెట్ పరిసరాలు పూర్తిగా ముంపులోకి చేరడంతో ప్రజలు, వ్యాపారులు అసౌకర్యానికి గురయ్యారు.

ఉచిత ఇసుకపై అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 25: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఉచిత ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ అమలు తీరుపై రాష్ట్ర ఎక్సైజ్, గనులు భూగర్భశాఖ పిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా బుధవారం అమరావతినుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. దీనికి కాకినాడ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్ మీనా, గనులశాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పంపిణీ పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారందరికీ వాహనాలు కేటాయించి సకాలంలో ఇసుక పంపిణీ చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో గనులశాఖ డీడీ నరసింహరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిమ్లా-2024

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 25: సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్(సిమ్లా) 20వ యాన్యువల్ కాన్ఫరెన్స్ కాకినాడ రంగరాయ వైద్యకళాశాల ఆడిటోరియంలో గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.ఫణికిరణ్ తెలిపారు. ఈ సదస్సుకు దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాలనుంచి 500మంది వైద్యులు, వైద్యవిద్యార్థులు సదస్సుకు హాజరుకానున్నారన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఫోరెన్సిక్ మెడిసన్, టాక్సికాలజీ విభాగాల్లో వచ్చిన నూతన పోకడలు, అత్యాధునిక సాంకేతికతపై వైద్యనిపుణులు హాజరై ప్రసంగించనున్నారు.

జనసేన ఆధ్వర్యంలో పెద్దాపురంలో ప్రాయశ్చిత్త దీక్ష

పెద్దాపురం, సెప్టెంబరు 25: సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి కల్తీ ఆరోపణల నేపథ్యంలో జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి(బాబు) ఆధ్వర్యంలో పెద్దాపురం మెయిన్‌రోడ్డులోని దాసాంజనేయస్వామి ఆలయంవద్ద ప్రాయశ్చిత్త దీక్షను బుధవారం చేపట్టారు. దీక్షకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, బీజేపీ రాష్ట్ర నాయకుడు బిక్కిన విశ్వేశ్వరరావు తమ సంఘీభావాన్ని తెలియచేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు రాజాసూరిబాబురాజు, విత్తనాల వెంకటరమణ, దాసు శివబాబు, మేడిది శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెద్దాపురంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

లైంగిక వేధింపులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 25: జిల్లాను లైంగిక వేధింపులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని, పడాల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏపీలో పలు జిల్లాలో అమలు జరుగుతున్న స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ కార్యక్రమాన్ని మరింత విస్తృత పరిచేదిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. కలెక్టరేట్‌లో పడాల ట్రస్ట్ సీఈవో సూర్యప్రసాద్ కలెక్టర్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ పసిపిల్లలపై లైంగిక వేధింపులు నివారించే దిశగా పడాల ఛారిటబుల్ ట్రస్ట్ పనిచేయాలన్నారు. పిల్లల భద్రత, రక్షణ మన అందరి బాధ్యత, ప్రతి పాఠశాల, కళాశాల, హాస్టల్, ఇంట్లో పిల్లల క్షేమంగా ఉండాలన్నారు. అక్టోబరు మొదటి వారంలో జిల్లాస్థాయి అధికారులు అందరితో ఒక అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలన్నారు. పీవోసీఎస్‌వో చట్టం తీవ్రత, లోతు చాలామంది తల్లిదండ్రులకు, టీచర్లకు, అధికారులకు కూడా అవగాహన లేదన్నారు. అవగాహన వస్తేనే లైంగిక వేధింపులు తగ్గే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ భావన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అదానీ వలంటీర్ల నియామకం నిర్ణయం ఉపసంహరణ

- ఐసీడీఎస్ పీడీ
- ఆందోళన వాయిదా వేశామని అంగన్‌వాడీ సంఘం ప్రకటన

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 25: అంగన్‌వాడీ సెంటర్లలో అదానీ వలంటీర్ల నియామకాన్ని ఉపసంహరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారని ఐసీడీఎస్ పీడీ స్పష్టం చేయడంతో ఈనెల 26న ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తలపెట్టిన ఛలో కలెక్టరేట్‌ని వాయిదా వేస్తున్నట్లు యూనియన్ నాయకులు ప్రకటించారు. అదాని విల్‌మార్ పరిశ్రమ 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో వలంటీర్లను నియమిస్తున్నట్లు అదానీ ఫౌండేషన్ అధికారులు ప్రకటించారు. దీంతో సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనకు పిలుపునిచ్చింది. దీనిపై ఐసీడీఎస్ పీడీ సమక్షంలో సమావేశం నిర్వహించి అంగన్‌వాడీ యూనియన్ అభ్యంతరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా వారి అభ్యంతరం మేరకు వలంటీర్లను ఉపసంహరించుకోవాలని కలెక్టర్ తెలిపారని ఐసీడీఎస్ పీడీ అంగన్‌వాడీ సంఘ నాయకులకు సమాచారం అందించగా ఛలో కలెక్టరేట్ ఆందోళన వాయిదా వేశామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి ప్రకటించారు. రాతపూర్వకంగా ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా దీపిక



సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ఎం.దీపిక ఐపీఎస్(2014)ను నియమిస్తూ ప్రభుత్వంబుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఆగస్టు 31 నుంచి శ్రీకాకుళం ఏపీఎస్పీ 1వ బెటాలియన్ కమాండెంట్ పి.శామ్యూల్ జాన్ ఇప్పటివరకు 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేశారు. రెగ్యులర్ ఖాళీ పోస్టు భర్తీలో భాగంగా దీపికను ప్రభుత్వం నియమించింది. ఆమె, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ భార్యాభర్తలు కావడం విశేషం.

వయసు 33..చోరీ కేసులు 44

దొంగల ఆటకట్టించిన తూర్పు పోలీసులు

400 గ్రాముల బంగారం, యాక్టివా బైక్ స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ



చోరీ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కంటికి కనబడిన ఇంటికి కన్నం వేయడంలో ఆరితేరిపోయారు. మూడు పదుల వయసులోనే నాలుగు పదుల కేసుల్లో చాలాసార్లు జైలుకు వెళ్లొచ్చినా దొంగబుద్ధిలో కొద్దిగా కూడా మార్పు రాలేదు. జైలుకు వెళ్లడం, విడుదల కావడం...మళ్లీ దొంగతనం చేయడం దైనందిన జీవనంగా మార్చుకున్న దొంగలను కొవ్వూరు పట్టణ పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. ఎస్పీ నరసింహ కిశోర్ వీటి వివరాలను వెల్లడించారు. కొవ్వూరులోని మహమ్మద్ మహారాజ్‌కి చెందిన అపార్ట్‌మెంట్‌లో కట్టా ఉషశ్రీ నివాసం ఉంటున్నారు. గతనెల 26న బెడ్‌రూంలో నిద్రించారు. తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో మేల్కొగా బీరువా తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. బీరువాలోని బంగారు వస్తువులు, నగదు, సెల్‌ఫోన్, సెల్లార్లో ఉన్న యాక్టివా కనబడకపోవడాన్ని గుర్తించారు. దీనిపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దీంతో ఎస్పీ ఆదేశాలతో కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ పర్యవేక్షణలో కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఏవీఏ రోడ్డులో ఉం టున్న కాకినాడ జిల్లా ఏటిమొగకు చెందిన పొన్నాడ రవిశంకర్ (వీరబాబు)ను, భీమవరం పాలూరువారి వీధికి చెందిన లంకలపల్లి నాగరాజును అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. యాక్టివా బైక్‌తోపాటు రూ.15.30లక్షల విలువ చేసే 400 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశామన్నారు. మరికొంత బంగారాన్ని ఒక ఫైనాన్సులో కుదువ పెట్టారని దానిని రికవరీ చేయాల్సి ఉందన్నారు. గతంలో వీరబాబుపై పశ్చిమ గోదావరి జిల్లాలో 22, విశాఖలో 16, తూర్పు గోదావరిలో 2, శ్రీకాకుళంలో 2, విజయనగరం, అనకాపల్లి జిల్లాలో ఒక్కోటి కలిపి మొత్తం 44 కేసుల్లో జైలుశిక్ష అనుభవించాడని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒక కేసులో శిక్ష అనుభవించి విడుదల అయ్యాడన్నారు. రెండో నిందితుడు నాగరాజుపై గతంలో క్రికెట్ బెట్టింగ్‌పై భీమవరంలో, హత్యాయత్నంపై పాలకోడేరులో నమోదైన కేసుల్లో జైలుకు వెళ్లొచ్చాడని ఎస్పీ చెప్పారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన కొవ్వూరు టౌన్, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయ బాబు, ఎస్ఐలు పి.రవీంద్రబాబు, కె.జగన్మోహన్ రావు, హెచ్‌సీలు కె.వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, ఆర్.సత్య నారాయణ, పీసీలు అప్సారీ బేగ్, శ్రీనివాసరావు, సుగుణ కుమార్, అనీల్‌కుమార్, బేగ్ రహమతుల్లా, రాజులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు

మరో కేసులో ఇద్దరు అరెస్టు

ఒక డ్రైవరును కత్తితో బెదిరించి ఉంగరాలు, నగదు చోరీ చేసిన కేసులో రాజానగరం పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం...రాజానగరం మండలం శ్రీరాంపురా నికి చెందిన వరదా మణికంఠ ఛత్తీసగఢ్‌లోని సుకుమా జిల్లా కుంటలో నివసిస్తూ పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. ఈ నెల 22న కుంట నుంచి బొలెరోలో వస్తూ గామన్ బ్రిడ్జి రోడ్డులోని నయారా పెట్రోల్ బంక్ సమీపంలో బహిర్భూమికి ఆగాడు. అప్పటికే అక్కడ తుప్పల్లో నక్కి ఉన్న ఇద్దరు వ్యక్తులు అతడిని కత్తితో బెదిరించి రెండు బంగారు ఉంగరాలు, సెల్‌ఫోన్, రూ.10వేలు లాక్కొని పారిపోయారు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేయగా సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. కొంతమూరుకు చెందిన సాలా బలరామ్(డీజే), బాలం ఏసులను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసి, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. హైవేలపై ప్రయాణించే వాళ్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే 112కి ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్ఐ మనోహర్, మహిళా ఎస్ఐ రేవతి, హెచ్‌సీ అమ్మిరాజు, పీసీలు పవన్‌కుమార్, వెంకటరమణను అభి నందించారు. అయితే బహిర్భూమికి వెళ్లడం వాస్తవం కాదని తెలుస్తోంది. ఆ ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలో విటులు బంగారు ఆభరణాలతో ఉన్నా, వాళ్ల వద్ద డబ్బు ఎక్కువగా ఉన్నట్లు గమనించినా సదరు మహిళలు తాము ముందు గానే ఏర్పాటు చేసుకున్న వ్యక్తులు లేదా తమకు అనుకూలమైన పోలీసులకు సమాచారం ఇచ్చి ప్లాన్ ప్రకారం దోపిడీ చేయిస్తారని ప్రచారం జరుగుతోంది. తర్వాత చోరీ సొత్తును వారంతా వాటాలు వేసుకుంటారని సమాచారం. చాలా మంది ఇలా దోపిడీకి గురైనా చట్ట వ్యతిరేక పని కావడంతో తమపైన కేసు పెడతారనే భయంతో మిన్నకుండిపోతున్నారు. దీంతో తాము దోపిడీకి గురైనా పోలీసులకు ఫిర్యాదు అందడం లేదని సమాచారం.

బలభద్రపురంలో దారుణ హత్య

మరిది చేతిలో హత్యకు గురైన వదిన



హత్యకు గురైన బుజ్జి

బిక్కవోలు, సెప్టెంబరు 25: బిక్కవోలు మండలం బలభద్రపురంలో మద్యం మత్తులో వదినను మరిది హత్య చేసిన సంఘటన జరిగింది. అనపర్తి సీఐ శివగణేష్ తెలిపిన వివరాల ప్రకారం డోకుబుర్ర బుజ్జి(40) మరిది అయిన డోకుబుర్ర గంగరాజు గ్రామంలో ఎదురెదురు ఇళ్లలో నివశిస్తున్నారు. మృతురాలి భర్త చనిపోయి నాలుగేళ్లు కాగా, కుమారుడు, కుమార్తెతో కలసి గంగరాజు ఇంటి ఎదురుగా వుంటున్నారు. ఆమె కుమారుడు శ్రీను పనిలోకి వెళ్లడం లేదంటూ మరిది గంగరాజు అతనిని కొట్టడంతో చొక్కా చిరిగిపోయింది. చిరిగిన చొక్కాతో ఇంటికి వచ్చిన కొడుకును ఏం జరిగిందని అడగ్గా విషయం చెప్పడంతో గంగరాజును ఎందుకు కొట్టావని బుజ్జి నిలదీసింది. దీంతో మద్యం మత్తులో వున్న గంగరాజు మరలా శ్రీనుని కొట్టడానికి ప్రయత్నించగా శ్రీను పారిపోతుండగా అడ్డుగా వెళ్లిన బుజ్జి పరుగెత్తి పడిపోయింది. దీంతో గంగరాజు అక్కడ వున్న సిమ్మెంటు ఇటుకతో ఆమె తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గంగరాజు వివరించారు. నిందితుడిని బిక్కవోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మహిళను మోసంచేసి పెళ్లికి నిరాకరించిన వ్యక్తికి జైలుశిక్ష

అన్నవరం, సెప్టెంబరు 25: మహిళను నమ్మించి మోసం చేసి ఆపై పెళ్లికి నిరాకరించిన వ్యక్తికి న్యాయమూర్తి 12 ఏళ్ల జైలుశిక్ష విధించినట్లు ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే...కాకినాడ జిల్లా శంఖవరం మండలం గొంది గ్రామానికి చెందిన గంటిమల్లె సతీష్ (30) గత ఏడాది ఒక మహిళను తల్లిదండ్రులు లేని సమయంలో ప్రేమ..పెళ్లి పేరుతో మోసం చేసి ఆపై పెళ్లికి నిరాకరించడంతో అప్పట్లో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి ఎస్ఐ బి.అజయ్‌బాబు అత్యాచారం కేసు నమోదు చేయడంతో రాజమండ్రి 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు 5వేల జరిమానా విధించారు. జరిమానా కట్టని పక్షంలో రెండేళ్ల జైలుశిక్షను విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తెలిపారు. ఫిర్యాది తరుపున పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదించారని ఆయన చెప్పారు.

పిఠాపురం అధికారుల వివాదంపై విచారణకు కమిటీ

ప్రభుత్వ ఆదేశాలు జారీ

పిఠాపురం, సెప్టెంబరు 25: పిఠాపురం పురపాలక సంఘంలో కమిషనరు, డీఈఈ మధ్య జరిగిన తోపులాట, వాగ్వివాదం వ్యవహారంపై విచారణకు ప్రభుత్వం ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది.

ఆగస్టు 31న పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ కనకారావు, డీఈఈ భవానీప్రసాద్ కౌన్సిల్ సభ్యుల సాక్షిగా వాగ్వివాదానికి దిగి ఒకరిని ఒకరు తోసుకోవడంతోపాటు కొట్టుకున్నారు. అందరు తలదించుకునేలా బూతులు తిట్టుకున్నారు. ఈ వ్యవహారంపై అప్పట్లో మునిసిపల్ ఆర్డీ నాగనరసింహారావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. దీనిపై కలెక్టరు పంపిన నివేదిక ఆధారంగా మునిసిపల్ డీఈఈ భవానీశంకర్‌ను సస్పెండ్ చేశారు. ఇద్దరు అధికారుల మధ్య జరిగిన ఘర్షణ వ్యవహారానికి సంబంధించి పూర్తిస్థాయి విచారణ కోసం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పి.పూర్ణచంద్రరావు, డిప్యూటీ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.బ్రహ్మాజీ, టౌన్‌ప్లానింగ్ అడిషనల్ డైరెక్టరు బి.శ్రీనివాసులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ పురపరిపాలనాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

చిరుతపులి కదలికలపై మంత్రి దుర్గేష్ ఆరా

కడియం, సెప్టెంబరు 25: కడియంలో చిరుతపులి సంచారంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం కడియం వచ్చిన మంత్రి దుర్గేష్ అటవీశాఖ అధికారులను ఆరా తీశారు. పులి సంచారంపై వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు భయాందోళనలు లేకుండా చూడాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. రైతు తిరుమలశెట్టి భాస్కరరావు నర్సరీ నుంచి చెక్కపల్లి సత్తియ్య చేను వైపు చిరుతపులి వెళ్ళినట్లు పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు.

● ట్రాప్ కెమేరాలు ఏర్పాటు

చిరుతపులి కదలికలను గుర్తించడానికి ట్రాప్ కెమేరాలు, సీసీ కెమేరాలు అమర్చినట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్. భరణి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...కడియం నుంచి వీరవరం వెళ్ళే రోడ్డులో దోసాలమ్మకాలనీ దగ్గరలోనున్న ఎన్ఎస్‌టీసీ నర్సరీలో చిరుతపులి పాదముద్రలు గుర్తించామన్నారు. అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షం కారణంగా వాటి ఆనవాళ్లు పోయాయన్నారు. గతంలో వరదల సమయంలో గోదావరి మీదుగా వచ్చి ఉంటుందని భావిస్తున్నామన్నారు. బుర్రిలంక సమీపంలో గోదావరి లంకల్లో జింకలు ఉండటంతో అటువైపుగా వెళుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. చిరుతపులి కదలికలను గుర్తించడానికి సిబ్బంది బృందాలుగా ఏర్పడి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

● కడియం నర్సరీ అసోసియేషన్‌తో సమావేశం

అటవీశాఖ అధికారులు నర్సరీ అసోసియేషన్‌తో సమావేశం అయ్యారు. నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, కార్యవర్గ సభ్యులతో మాట్లాడారు. నర్సరీల్లో పనిచేసే కార్మికులు ముగ్గురు లేదా నలుగురు కలిసి వెళ్ళాలన్నారు. చేతిలో కర్ర, టార్చ్‌లైటు దగ్గర ఉంచుకోవాలన్నారు. ఇరుకు షెడ్‌లు ఉన్న నర్సరీ రైతులు ముందుగా టార్చ్‌లైటుతో అంతా పరిశీలించి తరువాతే షెడ్డు తాళం తీయాలని సూచించారు. అసత్య ప్రచారాలు చేసిన వారిపై పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు.



అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్.



నర్సరీలో పరిసరాలను పరిశీలిస్తున్న ఫారెస్టు సిబ్బంది

18 ఎక్స్‌ప్రెస్ రైళ్ళకు వరంగల్‌లో తాత్కాలికంగా స్టాపు ఎత్తివేత

సామర్లకోట, సెప్టెంబరు 25: వరంగల్ సమీపాన విజయవాడ, ఖాజీపేట, బలార్షా సెక్షన్‌ల్లో హసనపర్తి వద్ద నిర్వహిస్తున్న నాలుగో రైల్వేలైన్ పనులు, ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా సామర్లకోట మీదుగా హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే 18 సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 29 వరకూ వరంగల్ రైల్వేస్టేషన్‌లో స్టాపు తాత్కాలికంగా ఎత్తివేసినట్లు, ఈ కారణంగా కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ళకు ఖాజీపేటలో నిలుపుదల ఇచ్చినట్లు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే గరీబ్‌రథ్(12739)ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 28 వరకూ, సికింద్రాబాద్-విశాఖ గరీబ్‌రథ్(12740)కు 26 నుంచి 29 వరకూ, షాలీమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, టాటా- యశ్వంత్‌పూర్ (18111)ఎక్స్‌ప్రెస్ 26న, సికింద్రాబాద్-విశాఖ (20707) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ 26,27,28ల్లో, విశాఖ- సికింద్రాబాద్ (20708) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ 27,28,29ల్లో, సికింద్రాబాద్- విశాఖ (20834) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ 26,27,28ల్లో, విశాఖ-సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 26,27,28ల్లో వరంగల్‌లో స్టాపు ఎత్తివేసి తాత్కాలిక ప్రత్యామ్నాయంగా ఖాజీపేటస్టేషన్‌లో స్టాపు ఇచ్చారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727) 26,27ల్లో, గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) 26,27,28ల్లో, మహబూబ్‌నగర్-విశాఖ (12862) ఎక్స్‌ప్రెస్ 26,27,28,29ల్లో, షాలీమార్-హైద్రాబాద్ (18045) ఎక్స్‌ప్రెస్ 26,27ల్లో, హైద్రాబాద్-షాలీమార్ (18046)ఎక్స్‌ప్రెస్ 26,27,28ల్లో, విశాఖ-షిర్డీసాయినగర్ (18503)ఎక్స్‌ప్రెస్ 26న, షిర్డీసాయినగర్-విశాఖ (18504)ఎక్స్‌ప్రెస్ 27న, షాలీమార్-సికింద్రాబాద్ (22849)ఎక్స్‌ప్రెస్ 26న, సికింద్రాబాద్-షాలీమార్ (22850)ఎక్స్‌ప్రెస్ 27న వరంగల్‌లో స్టాపు ఎత్తివేసారు.

బెంగుళూరు-భువనేశ్వర్ మధ్య రాకపోకలు సాగించే (18464) ప్రశాంతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26న మధ్యాహ్నం 1.40 గంటలకు బదులుగా సాయంత్రం 4.10 గంటలకు బెంగళూరులో రీషెడ్యూల్‌లో బయలుదేరుతుంది. మరింత సమాచారం కోసం ఆయా సమీప రైల్వేస్టేషన్లలోని బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు ఆ ప్రకటనలో తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆన్‌లైన్ శిక్షణ..ఉద్యోగ అవకాశాలు: పీడీ లచ్చారావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 25: విభిన్న ప్రతిభావంతులకు ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను ఆయన ఛాంబర్‌లో వికాస పీడీ లచ్చారావు, సార్థక్ సంస్థ ప్రతినిధి కిషోర్, విభిన్న ప్రతిభావంతులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణమూర్తి కలిసారు. ఈ సందర్భంగా వికాస ఆధ్వర్యంలో సార్థక్ సంస్థ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు ఇచ్చే ఆన్‌లైన్ శిక్షణ గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ శిక్షణకు ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఏళ్లలోపు 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఈ శిక్షణకు అర్హులైన వారు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 77993 76111 నెంబరులో సంప్రదించాలన్నారు.

బాలికను గర్భవతి చేసిన దత్తత తండ్రి అరెస్టు

కె.గంగవరం, సెప్టెంబరు 25: బాలికను గర్భవతిని చేసిన దత్తత తండ్రిని అరెస్టు చేసినట్టు పామర్రు ఎస్ఐ కె.జానీబాషా చెప్పారు. మండలంలోని ఒక గ్రామంలో ఒక మహిళ తన బిడ్డను పిల్లలు లేని తన సోదరికి దత్తత ఇచ్చింది. ఆ తర్వాత తల్లి కూలి పనుల కోసం హైదరాబాద్ వెళ్లిపోయింది. బాలికకు 14 ఏళ్ల వయస్సులో 2022 సంవత్సరంలో దత్తత తండ్రి సత్తిబాబు బాలికపై పలు మార్లు లైంగిక దాడికి పాల్పడగా బాలికకు గర్భం వచ్చింది. దాన్ని తీయించడానికి అతడు బాలికను అప్పట్లో హైదరా బాద్ తరలించి అక్కడ ఒక నర్సింగ్ హోమ్‌లో చేర్చాడు. అక్కడ ఎంఎల్‌సీ ఇంటిమేషన్, బాధితురాలి స్టేట్‌మెంట్‌పై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత ఆ కేసును కోనసీమ జిల్లా ఎస్పీ ద్వారా పామర్రు పోలీసులకు బదిలీ చేశారు. అప్పట్లో పామర్రు పోలీసుస్టేషన్‌లో 22 సెప్టెంబరు 2022లో పోక్సో చట్టం క్రింద సత్తిబాబుపై కేసు నమోదు చేయగా, అప్పటి నుంచి సత్తిబాబు పరారీలో ఉన్నాడు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో డీఎస్పీ బి.రామ కృష్ణ ఆధ్వర్యంలో సీఐ కె.అశోక్, తాను సిబ్బందితో ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడి గ్రామంలో బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ ఎస్‌కే జానీబాషా చెప్పారు.

ఎక్సైజ్ డీసీగా చైతన్య మురళి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 25: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా వై.చైతన్యమురళి కాకినాడ నాగమల్లితోటలోని ఆయన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డి.శ్రీకాంత్‌రెడ్డి శ్రీకాకుళం బదిలీ అయ్యారు. పోస్టింగ్ కోసం వెయిట్ చేస్తున్న చైతన్యమురళిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పరస్పర ఫిర్యాదులపై విచారణ పూర్తి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 25: కాకినాడ జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది డీసీపీవో చదలాడ వెంకట్రావు, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ ఒకరిపై ఒకరు ఇచ్చుకున్న ఫిర్యాదుపై విచారణ కమిటీ సభ్యులు విచారణ పూర్తి చేశారు. వారి నిర్ణయం ప్రకారం నివేదిక తయారు చేసి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ గుంటూరు, జిల్లా కలెక్టర్‌కి అందించినట్లు పీడీ తెలిపారు. వారిద్దరూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. సోషల్ వర్క్ వారు ఐసీపీఎస్ కార్యాలయంలో విధులు నిర్వహించుకుంటూ ఇబ్బంది పడుతున్నారని భావించి తక్షణమే జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ కాకినాడలో విధులు నిర్వహించాలని మౌఖికంగా ఆదేశించారు.

కాకినాడ ఆర్టీవో కార్యాలయంలో బదిలీలు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 25: కాకినాడ జిల్లా ఆర్టీవో కార్యాలయంలో ముగ్గురు అధికారులు బదిలీ అయ్యారు. డీటీసీ ఎ.మోహన్ విజయవాడ బదిలీ కాగా ఆయన స్థానంలో కర్నూల్ డీటీసీ శ్రీధర్ రానున్నారు. పరిపాలన అధికారి(ఏఓ) సత్తిబాబు రాజమహేంద్రవరం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అక్కడ పనిచేస్తున్న పెన్సిస్‌బాబు ఇక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు. ఏఎంవీఐ షణ్ముఖ శ్రీనివాస్ రావులపాలెం బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న నాగేంద్ర ఆయన స్థానంలో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ



కాకినాడ క్రైం, సెప్టెంబరు 25: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ జిల్లా సూపరింటెండెంట్‌గా కృష్ణకుమారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె విశాఖపట్నం సెబ్ సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేయడంతో ఆమె పోస్టింగ్ కోసం వెయిట్ చేస్తున్నారు. సామర్లకోట డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ కోనసీమ జిల్లా అమలాపురానికి బదిలీ అయ్యారు.



సుబ్బంపేట వద్ద బీచ్ రోడ్డుకు రక్షణగా ఏర్పాటు చేసిన బండరాళ్ళను తాకుతున్న కెరటాలు

ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

కొత్తపల్లి, సెప్టెంబరు 25: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. తీరం వెంబడి ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో అలలు ఉధృతంగా ఎగసిపడతున్నాయి. ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాలు సుబ్బంపేట, కొత్తపట్నం వద్ద బీచ్‌రోడ్డుకు రక్షణగా ఏర్పాటు చేసిన బండ రాళ్ళను తాకుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో తీరప్రాంతాలకు చెందిన మత్స్యకారులు బుధవారం వేటను విరమించారు. అలివితో వేటాడే మత్స్యకారులు యధావిధిగా వేటను కొనసాగించారు.

ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

వీసీ ఆచార్య శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 25: యువత ఉద్యోగం చేస్తున్న ప్రదేశంలో అనుభవాన్ని, నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థానాలకు చేరుకునే దిశగా అడుగులు వేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగాలకు బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి బీఎస్సీ మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసిన 103 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరికి రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి హైదరాబాద్, విశాఖపట్నం రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగాలు కల్పిస్తారని వీసీ తెలిపారు. అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపిక తర్వాత డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ హెచ్.ఆర్, బి.శరణ్య మాట్లాడుతూ హైదరాబాద్, విశాఖపట్నం రెడ్డీస్ ల్యాబ్‌లో పనిచేయడానికి 38 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. భవిష్యత్‌లో ప్రాంగణ ఎంపికలకు నన్నయ విద్యార్థులకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డి, రెడ్డీస్ ల్యాబ్ విభాగ అధిపతులు జె.వెంకట సురేష్, బి.అప్పారావు, ఎస్.అశోక్, మురగన్, గజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ధీరూభాయ్ అంబాని క్విజ్ పోటీలు



అంబాని క్విజ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 25: తూర్పుగోదావరి జిల్లాలో ధీరూభాయ్ అంబాని క్విజ్ పోటీలు నిర్వహించేందుకు రిలయన్స్ సంస్థ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పోటీలను కాకినాడ జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్నారు. డిసెంబర్ 5న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో, 6న అమలా పురం అంబేద్కర్ భవన్‌లోను, 7న కాకినాడ అంబేద్కర్ భవన్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ క్విజ్ పోటీలు జరపనున్నారు. విషయ పరిజ్ఞానం, ప్రపంచ, భారతదేశ చరిత్ర, సామాజిక అంశాలు క్విజ్ పోటీలలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. ఒక్కో టీమ్‌లో ఇద్దరు విద్యార్థుల చొప్పున ఒక్కో స్కూల్ నుంచి రెండు టీమ్‌లను అనుమతించ నున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులకు వేర్వేరుగా క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ స్కూల్స్ టీమ్‌లను ప్రయాణ ఖర్చులు ఇవ్వనున్నారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నారు. ఆసక్తిగల విద్యార్థులు నవంబరు 30వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలి. పేర్లు నమోదుకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఫోన్ నెంబర్లు 0884 3577222, 63022 23156 నెంబర్లలో తెలియజేయాలి. ఈ మేరకు మూడు జిల్లాల్లో విద్యాశాఖాధికారుల ద్వారా రిలయన్స్ సంస్థ ప్రతినిధులు క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణలో తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, ఏడీ వెంకటరాజు, సీఎంవో శ్రీనివాసరావు, రిలయన్స్ సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. వివరాలకు 99599 88835, 0884 6677555లలో సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు

పిచ్చికుక్క స్వైర విహారం

● 24 మందికి గాయాలు

● బాలుడి చేతివేలును కొరికిన వైనం

రౌతులపూడి, సెప్టెంబరు 25: పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఆరు గ్రామాల్లో 24 మందిని గాయపరిచింది. ఈ ఘటనలో ఒక బాలుడి చిటికిన వేలు పూర్తిగా తినేసింది. ఎట్టకేలకు కొంత మంది చేతుల్లో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. .కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎమ్.కొత్తూరు గ్రామంలో ఒకరిని గాయపరిచి తదనంతరం మూలగపూడి వెళ్లి 13 మందిని గాయపరిచింది. అక్కడ నుంచి బలరామపురం గ్రామంలో నలుగురిని, ఎ.మల్లవరంలో ముగ్గురిని, రౌతులపూడిలో ఇద్దరిని, ఎస్.పైడిపాలలో ఒకరిని గాయ పరిచింది. వారందరికి రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నందించారు. ఎ.మల్లవరం గ్రామానికి చెందిన చెందాడ వీరబాబు కుమారుడు చెందాడ సన్నిబాబు(8) చేతి చిటికేలు వేలును పూర్తిగా తినేసింది. మూలగపూడిలో హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు దేవరాజుపై దాడి చేసింది. బలరామపురంలో దాన్ని కుక్కను చంపేశారు.

జగ్గంపేట సీహెచ్‌సీలో అరుదైన ఘటన

4.5 కిలోల ఆడబిడ్డ జననం



తల్లిబిడ్డలతో డాక్టర్ల బృందం

జగ్గంపేట, సెప్టెంబరు 25: కాకినాడ జిల్లాలో జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో వైద్యుల పర్యవేక్షణలో ఓ మహిళ సాధారణ కాన్పు ద్వారా 4.5 కిలోల ఆడబిడ్డకు జన్మించింది. జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామానికి చెందిన టి.అచ్చివేణి నెలలు నిండడంతో జగ్గంపేట ప్రభుత్వాసుపత్రిలో కాన్పు నిమిత్తం చేరింది. ఆమెకు అన్ని రకాలుగా పరీక్షించిన వైద్యులు సిజేరియన్ అవసరం లేకుండా డాక్టర్ ప్రణీత ఆధ్వర్యంలో ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ వర్మ నేతృత్వంలో సాధారణ కాన్పు వేశారు. ఈ కాన్పులో 4.5 కిలోల ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. సాధారణంగా అంత బరువు ఉన్న పిల్లలకు సిజేరియన్ ద్వారా కాన్పు వేయడం జరుగుతుంది. కానీ జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పు వేసి డాక్టర్లు శభాష్ అనిపించుకున్నారు. వైద్యులు, వైద్య సిబ్బందికి అచ్చివేణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పసికందుకు అరుదైన చికిత్స

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 25: ప్రాణాపాయంలో ఉన్న రెండు నెలల పసికందుకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు. ఇందుకు సంబంధించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి బుధవారం వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన కామేశ్వరరావు భార్య గంగకు గతనెల రెండో వారంలో కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మగ శిశువు జన్మించాడు. తక్కువ బరువున్న 1.7 కిలోలు ఉన్న ఆ శిశువుకు అవయవాలు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో తల ఆకృతి కూడా సరిగా లేకుండా ట్రై గోనో సెఫాలీ అనే ఒక అరుదైన వ్యాధితో శిశువు జన్మించిందని వైద్యులు గుర్తించారు. అనంతరం శిశువుకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి గతవారంలో న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ విజయశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కోదండ గిరిరావ్, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, పిడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ డి.మాణిక్యాంబ ఆధ్వర్యంలో స్ట్రిప్ క్రేనియాక్టమి అనే అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించి విజయవంతమయ్యారు. ఇటువంటి శస్త్రచికిత్స జీజీహెచ్‌లో నిర్వహించడం మొట మొదటిసారని డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. శిశువు కుటుంబీకులు తమ బిడ్డకు పునర్జన్మను ప్రసాదించిన వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు


సామర్లకోట, సెప్టెంబరు 25: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు గడువు తేదీని అక్టోబరు 3వరకూ పొడిగిస్తూ ప్రభుత్వ పరీక్షల నిర్వాహక సంచాలకులు డి.దేవానందరెడ్డి బుధవారం తెలిపారు. నిర్ణీత ప్రొఫార్మాలో పరీక్ష రుసుము చెల్లించిన రశీదుతో దరఖాస్తులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేసేందుకు అక్టోబరు 14 వరకూ గడువు ఉన్నందున ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించాలన్నారు.

పిఠాపురంలో అర్బన్ బ్యాంకు ఎన్నికల సందడి

రేపటి నుంచి నామినేషన్లు ప్రారంభం

పిఠాపురం, సెప్టెంబరు 25: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అర్బన్‌బ్యాంకుల్లో ప్రత్యేకస్థానం కలిగి ఉన్న నాటి పిఠాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు, నేటి పిఠాపురం కోఆపరేటివ్ అర్బన్ క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. అర్బన్ సొసైటీ ఎన్నికలకు ఎన్నికల అధికారి పి.దుర్గాప్రసాద్ నోటిఫికేషన్ జారీ చేశారు. అక్టోబరు 6న ఎన్నికలు జరగనున్నాయి. సంఘంలో డిపాజిటర్లతో కలిపి 2011 మంది సభ్యులు ఉన్నారు. సొసైటీని 5 వార్డులుగా విభజించారు. ఇందులో1,3,4వార్డులను డిపాజిటర్లకు, 2,5వార్డులను సాధారణ సభ్యులకు కేటాయించారు. పిఠాపురం పట్టణంతో పాటు చిత్రాడ, కుమారపురం, కొండెవరం, నవఖండ్రవాడ, శొంఠివారిపాకలు, మాధవపురం, నర్సింగపురం తదితర గ్రామాల్లో సొసైటీకి సభ్యులున్నారు. గతం పాలకవర్గం గడువు 2024 ఆగస్టుతో ముగిసింది. ఎన్నికలకు 27న ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకూ నామినేషన్లు స్వీకరించనున్నారు. 28న నామినేషన్ల పరిశీలన, 29న సాయంత్రం 5గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటుంది. పోటీ ఉంటే అక్టోబరు 6న ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ పోలింగ్, తదనంతరం కౌంటింగ్, ఎన్నికల ఫలితాల ప్రకటన జరుగుతుంది. 7న ఉదయం 8గంటలు నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నిక జరుగుతుంది. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక జరుగుతుంది.

టీడీపీ సీనియర్ నేత సుంకర తమ్మారావు మృతి


తమ్మారావు (ఫైల్)

ప్రత్తిపాడు, సెప్టెంబరు 25: మండలంలో ఒమ్మంగి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు సుంకర తమ్మారావు (86) మృతిచెందారు. వయోభారం,అస్వస్థత కారణంగా ఆయన ఒమ్మంగిలోని తనస్వగృహం వద్ద బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు సంతానం. ఆయన కుమారుడు రాజా కూడా పీఏసీఎస్ అధ్యక్షుడిగా కొనసాగారు. సుంకర 27ఏళ్ల పాటు సొసైటీ అధ్యక్షుడిగా ఒమ్మంగి పీఏసీఎస్‌కు పనిచేయడమే కాకుండా ఆ సొసైటీ భవనానికి తన సొంత భూమికి విరాళంగా కూడా అందించారు. ఒమ్మంగి గ్రామ పంచాయతీకి కూడా గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. జిల్లాలో 3సార్లు ఉత్తమ సొసైటీకి ఒమ్మంగి పీఏసీఎస్‌కు ఎంపికైన సమయాల్లో తమ్మారావే ఆ సొసైటీకి అధ్యక్షుడిగా పని చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సుంకర కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, గొంతిన సురేష్, రామిశెట్టి మురళీకృష్ణ, అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు బుద్ధరాజు గోపిరాజులు, సుంకర తమ్మారావు భౌతిక కాయానికి నివాళులర్పించారు.

కేంద్రీయ విద్యాలయం వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25: కాకినాడ రూరల్ పి.వెంకటాపురం-పండూరు సెంటర్‌లో విద్యార్థుల సౌలభ్యం కోసం ఆర్టీసీ బస్సులు నిలిపేందుకు అనుమతి ఇచ్చినట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. బుధవారం పి.వెంకటాపురం సెంటర్‌లో గల కేంద్రీయ విద్యాలయాన్ని అసిస్టెంట్ మేనేజర్ బాల కృష్ణరాజు, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి.శేఖర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మానవ వనరులశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీబీఎస్‌ఈ సిలబస్‌తో కేంద్రీయ విద్యాలయం నిర్వహిస్తుందని, విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు వీలుగా బస్సు సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు రిక్వెస్ట్ స్టాప్‌కి అనుమతి ఇవ్వాలని ప్రిన్సిపాల్ కోరారు. ఈ మేరకు ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌కు అనుమతి ఇచ్చినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఆర్టీసీఅధికారుల అనుమతితో రిక్వెస్ట్ బోర్డు ఏర్పాటు చేశారు. విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్షాపత్రాల ఆవిష్కరణ

కిర్లంపూడి, సెప్టెంబరు 25: మండలంలోని సోమవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ పరీక్షాపత్రాలను హెచ్ఎం టి.కాంతారావు ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎన్.కన్నబాబు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ప్రతిష్టాత్మకంగా కిర్లంపూడి మండలంలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించిందన్నారు. మండలంలో 13 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి జూనియర్స్ విభాగంలో 603, సీనియర్స్ విభాగంలో 1033 మంది ప్రతిభా పరీక్ష రాశారని, అక్టోబర్ 1న మండలస్థాయిలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రాంబాబు, సుబ్రహ్మణ్యం, శివశంకర్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, గౌరీదేవి, భూలక్ష్మి, గీతాలక్ష్మి, శాంతిప్రియ, ఉషాలలిత, బాబురావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఐడియల్ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ

కాకినాడ రూరల్, సెప్టెంబరు 25: కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల ఆంగ్ల విభాగ అధ్యాపకురాలు ఎస్‌వీఎస్ గౌరీ మాధవికి ఆంగ్లంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) అవార్డు లభించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. పీహెచ్‌డీ థీమ్ ఆఫ్ హ్యూమానిజమ్ ఇన్ ది సెలక్టడ్ నోవెల్స్ ఆఫ్ జార్జి ఇలియట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ అవార్డు సాధించారన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఏవో వర్మ, కె.శ్రీహరి అభినందించారు.

పిఠాపురం ఎంఈవోగా శ్యాంబాబు

పిఠాపురం, సెప్టెంబరు 25: మండల విద్యాశాఖాధికారిగా జి.శ్యాంబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం బాధం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకూ పనిచేసిన ఆర్వీ ప్రసాద్‌ను కలెక్టర్ ఆదేశాలు పాటించకపోవడం, ఇతర ఆరోపణలపై విద్యాశాఖ ఆర్‌జేడీ సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో శ్యాంబాబుకు ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయులు అభినందించారు.

జనవాణిలో అర్జీలు స్వీకరించిన ప్రత్తిపాడు నేతలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 25: మంగళవారం జనసేన కేంద్ర కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, తూర్పుగోదావరి జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి దాసం శేషారావు పోలవరం జనసేన ఎమ్మెల్యే బాలరాజుతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి సమస్యలపై ఫిర్యాదు చేసే వారి నుంచి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గానికి చెందిన జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్ ఉన్నారు.

ఎంపీడీవోకు సచివాలయ ఉద్యోగుల వినతి

ఏలేశ్వరం, సెప్టెంబరు 25: మండలంలోని సచివాలయ ఉద్యోగులు పలు సమస్యలపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు అప్పగించిన వివిధ కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ప్రతీ నెలా 150 ఇళ్లకు తిరిగి పింఛన్లు తెల్లవారుజామున ఇవ్వడంతో ఒత్తిడికి లోనవుతున్నామని, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు పంచడం వంటి పనులపై పునరాలోచన చేయాలని లిఖిత పూర్వకంగా వినతి పత్రం అందజేశారు.

రేపు మినీ జాబ్ మేళా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 25: ఈనెల 27న వికాస సంస్థ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో కాకినాడ జగన్నాథపురంలోని ఏఎస్‌డీ ఉమెన్స్ కాలేజీలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, ఎంఎస్‌సీ, బీఎస్‌సీ, మైక్రోబయాలజీ, బీఎఫ్‌ఎస్‌సీ ఆక్వాకల్చర్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు శుక్రవారం ఉదయం సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో కాకినాడ జగన్నాథపురంలోని ఏఎస్‌డీ ఉమెన్స్ కాలేజ్ వద్ద హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376111 నెంబరులో సంప్రదించాలన్నారు.

తాళ్లరేవు తహశీల్దార్‌గా త్రినాథ్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 25: కాకినాడ ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న పితాని త్రినాథ్ తాళ్లరేవు మండలం తహశీల్దార్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా ఇంకా ఎవరినీ నియమించలేదు. ఆర్డీవో కార్యాలయంలో కోనేరు రంగారావు కమిటీ తహశీల్దార్‌గా జీఆర్ ఠాగూర్ నియమితులయ్యారు. కోనసీమ జిల్లా మలికిపురం మండలం తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు కలెక్టర్‌ను ఠాగూర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

అంతర్జాతీయ ఫార్మాసిస్ట్ దినోత్సవం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 25: ప్రపంచ ఆరోగ్య అవసరాలను తీర్చే ఫార్మాసిస్టులు అనే నినాదంతో అంతర్జాతీయ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని వర్సిటీలోని సెనేట్ హాల్లో ఐఎస్టీలోని స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, టెక్నాలజీస్ ఆధ్వర్యంలో బుధవారం విభాగాధిపతి బి.భవానీ అధ్యక్షతన నిర్వహించారు. రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఫార్మసీ కోర్సుల ప్రత్యేకాధికారిణి కె.పద్మప్రియ, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఏడీ డి.నాగమణి, ఆర్.శ్రీనివాసులు విశిష్ట అతిథులుగాను హాజరయ్యారు.

'ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి'

తాళ్లరేవు, సెప్టెంబరు 25: కార్మిక ఉద్యమనేత కామ్రేడ్ ఏచూరి సీతారాం ఉద్యమ ఆశయాలను కార్మికనేతలంతా ముందుకు తీసుకెళ్లాలని కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. బుధవారం తాళ్లరేవు ప్రజాసంఘాల కార్యాలయంలో ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రజాసంఘాల నేతలు, కార్మికులు, అంగన్వాడీలు, ఆశావర్కర్లు పూలమాలలతో నివాళులర్పించారు.

పూడిక తీత పనులు వృథా!

సామర్లకోటలో తొలగని ముంపు సమస్య


సామర్లకోటలో ముంపులో ఉన్న ఓ ప్రాంతం


మురుగు నీరు వెనుకకు మళ్లుతున్న దృశ్యం

సామర్లకోట, సెప్టెంబరు 25: పట్టణంలో పలు ప్రధాన డ్రైన్లలో ఇటీవల రూ.36 లక్షలతో పూడికతీత పనులు చేపట్టారు. అయితే ఈ పనుల్లో ఉన్నతాధికారుల అజమాయిషీ లేకపోవడంతో పూడికతీత పనులు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు నిదర్శనం గత 3 రోజులుగా పట్టణంలో కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు గతంలో వలే ముంపు బెడదలోకి చేరడమే. ప్రధాన మురుగు కాలువలకు అనుసంధానం చేసిన వెలంపేట, మఠంసెంటర్ ప్రాంతాలకు చెందిన పిల్ల కాలువల మీదుగా రివర్స్ పద్ధతిన రోడ్ల పైకి మురుగునీరు బుధవారం సాయంత్రం నాటికి కూడా వచ్చి చేరుతుండడం గమనార్హం. గతంలో ఎన్నడూ రోడ్లపై వర్షంనీరు నిల్వలు చూడని గోలివారి వీధి, నీలమ్మ చెరువు రోడ్డు ప్రాంతాలు మోకాలి ఎత్తున వరదనీరు ప్రవహించడం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన డ్రైన్లపై కొందరు వ్యక్తులు ఆక్రమణల పరంగా ఆయా ప్రాంతాల్లో పూడిక తొలగించకుండా వదిలివేయడం వల్ల పనులు పూర్తిస్థాయిల జరగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆక్రమణలను నిరోధించడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు చేసుకున్న భవననిర్మాణ యజమానులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు డ్రైన్లపై ఆక్రమణలు తొలగించకుండా వారికి అండదండలందించడంలో ముందుంటున్నారన్న ఆరోపణలు అనేకమున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, జయలక్ష్మీ టాకీసు రోడ్డు, మఠం సెంటర్, వీర్రాఘవ పురం ప్రాంతాలు ముంపు సమస్యలు లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ఆక్రమణదారులు తమ హవా కొనసా గిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతేడాది వెలంపేట ప్రధాన డ్రైన్‌పై ఆక్రమణలు తొలగించి పూడికతీత పనులు చేపట్టినప్పటికీ తిరిగి కొద్ది కాలానికే ఆక్రమణలు యథాతథం అయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో నేడు పూడిక తీత పనులు తూతూమంత్రంగానే నిర్వహించారని దీంతో ముంపు బెడద మామూలేనని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పట్టణంలో ప్రధాన డ్రైన్లపై ఆక్రమణలను రాజకీయాలకతీతంగా తొలగించి పూడిక తీత పనులు పారదర్శకంగా చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కాగా స్టేషన్ సెంటర్‌లో ఆక్రమణల కారణంగా మున్సిపల్ డ్రైన్, రైల్వే డ్రైన్‌లో పూర్తిగా ఆక్రమణల పర్వం కొనసాగుతుంది. ఈ దశలో మురుగు కాలువలలో పూడిక తీత పనులు మున్సిపల్ అధికారులకు ఛాలెంజ్‌గా మారింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించకుండా పూడికతీత పనులు తూతూమంత్రంగా నిర్వహించారన్న ప్రచారం ఉన్న నేపథ్యంలో స్టేషన్ సెంటర్లో డ్రైన్లపై ఆక్రమణలు పూర్తిగా తొలగించాల్సిందేనంటూ అధికారులు హెచ్చరించడంతో చిరు వ్యాపారులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

పవన్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం


జగ్గంపేటలో పూజల్లో తుమ్మలపల్లి, మహిళలు

జగ్గంపేట, సెప్టెంబరు 25: తిరుపతి లడ్డూ ప్రసాదంలో జరిగిన అపవిత్రానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జగ్గంపేట వేంకటేశ్వర ఆలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు సంఘీభావం దీక్ష చేశారు. తుమ్మలపల్లి ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి,లలితా పారాయణం పాటించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లడ్డూ అపవిత్రం చేసిన అప్పటి వైసీపీ ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూరంపాలెం బాలు, కుంచే కోటి, ఉలిసి ఐరాజు, మాదారపు వీరబాబు, మరిసే రామకృష్ణ, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా, రామవరం ఎంపీటీసీ దొడ్ల శ్రీను, మొగిలి గంగాధర్, గండేపల్లి దీపు, రామ్ రెడ్డి, సింహాద్రిపురం బాబ్జి, గంధం శ్రీను, నాగు పాల్గొన్నారు. జగ్గంపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో టీడీపీ నాయకులు వేములకొండ జోగారావు ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ జగ్గంపేట మండలాధ్యక్షులు మారిశెట్టి భద్రం, జేవీ ఆర్ గ్రూప్స్ అధినేత జైలు మణిబాబు, కొత్త కొండబాబు, టీడీపీ నాయకులు చెలికాని హరిగోపాల్, వైబోగుల కొండబాబు తదితరులు ఉన్నారు.

జగ్గంపేట రూరల్: ఇర్రిపాక భూదేవి శ్రీదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెహ్రూ మాట్లాడుతూ తిరుమల లడ్డూను వైసీపీ అపవిత్రం చేసినందుకు నియోజకవర్గంలోని అన్ని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాలు శుద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బస్వా చినబాబు, పంతం సత్యనారాయణ, జ్యోతుల సత్యమూర్తి, దొడ్డిపట్ల బుజ్జి, సోమవరం వీర్రాజు, అడపా తాతాజీ, కంద సత్యానందం, కోనేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కాట్రావులపల్లిలో గ్రామ టీడీపీ అధ్యక్షులు మునిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత

ఆలయాల్లో కూటమి నాయకుల పూజలు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి మోకాళ్లపై ప్రాయశ్చిత్త దీక్ష చేశారు. కూటమి గ్రామ జనసేన అధ్యక్షులు సుంకర శ్రీనివాస్, యేలేటి బాబి, సుంకర సీతారామయ్య కంటే రామారావు, వెన్న వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: బూరుగుపూడిలో మాజీ ఎంపీటీసీ పాటంశెట్టి రవి ఆధ్వర్యంలో శ్రీఅలివేలు మంగపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. చిల్లంగిలో భూ సమేత వేంకటేశ్వరాలయంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, కాళ్ల వెంకటేష్ 101 కొబ్బరికాయలు కొట్టారు.

తుని రూరల్: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు తునిలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. పాత బజారులో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుద్ధి చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో చోడిశెట్టి గణేష్, న్యాయవాది ప్రగడ చెక్రి, వంగలపూడి నాగేంద్ర, అద్దేపల్లి బాలాజీ, గెడ్డమూరి సురేష్, గొల్ల అజయ్ ఉన్నారు.

గండేపల్లి: గండేపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర, జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్.. జడ్.రాగంపేటలో టీడీపీ నేత కందుల చిట్టిబాబు, తాళ్ళూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ దాపర్తి సీతారామయ్య ప్రత్యేక పూజలు చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే రాజప్ప

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'


సామర్లకోటలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 25: గత వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనించడం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదికలో ముఖ్య అతిథిగా రాజప్ప మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గంలో గత ఐదేళ్లగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు ఇక నుంచి జోరుగా కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. కరపత్రాలను ప్రజలకు ఇంటింటా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఇంచార్జి వెంకటరమణ, పాల్గొన్నారు. పెద్దాపురం మరిడమ్మ ఆలయ సహాయ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి బుధవారం సామర్లకోట మండలం అచ్చంపేటలోని ఎమ్మెల్యే చినరాజప్ప స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. మరిడమ్మ ఆలయ అర్చకులచే వేదాశీర్వచనం చేసి శాలువా కప్పి పూలమాలతో రాజప్పను సత్కరించి ప్రసాదాలిచ్చారు.

'కూటమి ప్రభుత్వంతోనే ప్రగతి'

కరప, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, కాకినాడరూరల్ టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబులు పేర్కొన్నారు. మండలంలోని వలసపాకల, వేములవాడలో కూటమి నాయకులతో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యదర్శి పినిశెట్టి వీరభద్రరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

'కూటమితోనే సుపరిపాలన'

తుని రూరల్, సెప్టెంరు 25: సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. కుమ్మరిలోవ, ఎన్ఎస్‌వీ నగర్, కొలిమేరు గ్రామాల్లో ఆమె 100రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతు కూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమ రాజు, జక్కాన రామునాయుడు తదితరులున్నారు.

కోటనందూరు: కేఏ అగ్రహారం, కేవో మల్లవరం, ఎల్‌డీపేట గ్రామాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే యనమల దివ్య ముఖ్య అతిథిగా యనమల దివ్య హాజరయ్యారు. యనమల రాజేష్, పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, సుర్ల లోవరాజు, మోతుకూరి వేంకటేష్, చింతమనేడు అబ్బాయి, పెనుమం నాగేశ్వరరావు,షేక్‌నవాబ్ జానీ పాల్గొన్నారు.

'ప్రజాదరణ పొందిన ప్రభుత్వం'

రౌతులపూడి, సెప్టెంబరు 25: 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం ప్రజాదరణ పొందిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. రౌతులపూడిలో భవానీ ఫంక్షన్ హాల్ నందు టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, కోసూరి శ్రీనివాసవర్మ, ఎంపీటీసీలు సోమరౌతు రవి, బీజా రాజు, జెట్లా రాజా, కిల్లాడ వరహాలు,ఈగల సత్తిబబు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం: అన్నవరంలో టీడీపీ నాయకుడు రాజాల చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు అందజేశారు. పలివెల సతీష్, సోము సురేష్, సర్పంచ్ శెట్టిబత్తుల కిషోర్‌బాబు, మద్దు వీరబాబు, వీఆర్వో రాజశేఖర్ పాల్గొన్నారు.

కాకినాడలో బయోమెథనేషన్ ప్లాంట్ ఏర్పాటు

కమిషనర్ భావన

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 25: తడి చెత్త నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి చేసే బయోమెథనేషన్ ప్లాంట్‌ను కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎనర్గాన్ లాజిస్టిక్స్ వారు రూపొందించిన ప్రాజెక్టు ప్రెజంటేషన్‌ను కమిషనర్ పరిశీలించారు. పీపీపీ పద్ధతిలో రూ.20కోట్లతో ఏర్పాటు చేయబోయే ఈ ప్లాంట్‌కు సంబంధించిన వివరాలను ఎనర్గాన్ లాజిస్టిక్స్ హైదరాబాద్ ప్రతినిధులు కమిషనర్‌కు వివరించారు. సమావేశంలో ఎస్‌ఈ వెంకటరావు, ఎనర్గాన్ లాజిస్టిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 25: జిల్లాలో రెవెన్యూ విభాగంలో బదిలీలు పారదర్శకంగా నిర్వహించినందుకు కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కాకినాడ జిల్లాశాఖ అధ్యక్షుడు పితాని త్రినాథ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ రామ్మోహన్, రాజు, సంధ్య, దీపిక, యమున పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలి



పెద్దాపురం: సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పెద్దాపురం, సెప్టెంబరు 25: ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని కట్టమూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు తెగుళ్ల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలను తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి మల్లిఖార్జున, ఆత్మ పీడీ జోతిర్మయి, ఏడీఏ దైవకుమార్, ఏవో సంజయ్, హెచ్‌వో సుజాత, పశువైద్యాధికారి తోట నవీన్, కూటమి నేతలు మేడిది శ్రీనివాస్, యేలేటి సుబ్బారావు, గుత్తుల సూర్యావతి, మాదిరెడ్డి రామకృష్ణ, అడపా గంగాధర్ తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు: వాకపల్లి, వెంకటనగరంలో మండల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోం ది కార్యక్రమాలు నిర్వహించారు. ఏవో వైవీగంగాధర్, వాకపల్లి సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ గోకాడ చినబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మూరా చినబాబు, వ్యవసాయ సహాయకులు మణికంఠ రామలక్ష్మి, రైతులు తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధికి రూ.25లక్షల విరాళం

గొల్లప్రోలు, సెప్టెంబరు 25: రాష్ట్రంలోని వరద బాధితులకు హైదరాబాదు కేంద్రంగా ఉన్న ఆర్వీ అసోసియేట్స్ ఆఫ్ ఇండియా సంస్థ రూ.25లక్షల విరాళం ప్రకటించింది. ఈ మొత్తాన్ని సంస్థ ఎండీ ఆర్వీ చక్రపాణి బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన చక్రపాణిని సీఎం అభినందించారు. చక్రపాణి గొల్లప్రోలు పట్టణానికి చెందినవారు. ఆయన గొల్లప్రోలులోని పలు మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థికసహకారం అందించారు. ఇటీవల గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడను సంస్థ నిధులతో నిర్మించారు. చక్రపాణి ఔదార్యాన్ని పట్టణప్రజలు అభినందించారు.


విరాళం అందజేస్తున్న ఎండీ చక్రపాణి

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న ప్రభుత్వం : ఎంపీ

పెద్దాపురం, సెప్టెంబరు 25: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని పులిమేరు గ్రామంలో పాల్గొని నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలసి ఆయన మాట్లాడారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. నరాలశెట్టి బాబ్జీరావు, తుమ్మల నాని, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీల అమలు'

గండేపల్లి, సెప్టెంబరు 25: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారని జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. సూరంపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుమ్మలపల్లి హాజరయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, సర్పంచ్ మారిశెట్టి గంగాభవానీ, కుంచే రామకృష్ణ, పోసిన బాబురావు, సూరంపాలెం బాలు,కుంచే కోటి ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట, సెప్టెంబరు 25: పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో 4 అంగన్‌వాడీ పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జీ.ఉషా తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశామన్నారు. సామర్లకోట 28వ వార్డు గాంధీనగర్ నందు ఓసీ కేటగిరిలో హెల్పర్ పోస్టు, సామర్లకోట రూరల్ పరిధిలో వెంకటకృష్ణరాయపురం కొత్తూరులో ఎస్‌సీ కేటగిరిలో హెల్పర్ పోస్టు, సామర్లకోట అర్బన్ పరిధిలో 17వ వార్డు మట్టలదొడ్డి వద్ద హెల్పర్ పోస్టు, పెద్దాపురం అర్బన్ పరిధిలో 29వ వార్డు శెట్టిపేట వద్ద అంగన్‌వాడీ వర్కరు పోస్టులకు మహిళా అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. 1 జూలై 2024 నాటికి 21 ఏళ్లు నిండి 35 ఏళ్లు ఉన్నవారే అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబరు 5లోగాపెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేసి రశీదు పొందాలని తెలిపారు. మరిన్ని వివరాలకు పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం లేదా ఆయా సెక్టార్ పరిధిలోని సూపర్‌వైజర్లను సంప్రదించాలని సీడీపీవో ఉషా తెలిపారు.

కరప: అర్హులైన అభ్యర్థులు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ కాకినాడరూరల్ ప్రాజెక్టు సీడీపీవో యాసరపు లక్ష్మి సూచించారు. కరప మండలం పెదకొత్తూరు, సిరిపురం గ్రామాల్లో 2 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు అక్టోబరు 5 సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తులను ఐసీడీఎస్ కాకినాడరూరల్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన, సంబంధిత గ్రామ పరిధిలో నివాసముంటూ 21నుంచి 35 ఏళ్ల లోపు మహిళలు అర్హులన్నారు. పెదకొత్తూరు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు బీసీ-బి, సిరిపురం హెల్పర్ పోస్టుకు ఓసీ జనరల్ మహిళలు ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా అంగన్‌వాడీపోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్టు ఆ ప్రాజెక్టు సీడీపీవో ఆర్‌వీఎస్ లక్ష్మి తెలిపారు. మండలంలోని చింతలూరు2లో అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టు (ఓసీ)కి, వేములపాలెం హెల్పర్ పోస్టుకు ఓసీ) ఏలూరు హెల్పర్ పోస్టుకు (ఎస్‌సీ), 21 ఏళ్లు నిండి, 35 ఏళ్లకు మించని స్థానిక మహిళలు అక్టోబరు 5లోగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సీడీపీవో కోరారు.

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు

అన్నవరం, సెప్టెంబరు 25: అన్నవరం దేవస్థానంలో చేపడుతున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం సత్యగిరి కొండపై పరిసరాలు శుభ్రపరిచారు. అక్టోబరు 1వరకు కార్యక్రమం నిర్విరామంగా జరుగుతుందని, 2వ తేదీన మెక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కొండలరావు, సూపరెంటెండెంట్ కంచి మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తుని రూరల్: డి.పోలవరంలో జరిగిన సభలో డి.పోలవరం అభివృద్ధి కమిటీ సభ్యుడు పలకా సోమేశ్వరరావు మాట్లాడారు. ప్రజా అభిప్రాయాలు, సూచనలు తీసుకుని పారిశుధ్య నిర్వాహక పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అస్సాగో పరిశ్రమపై పిటిషన్

జగ్గంపేట, సెప్టెంబరు 25: నియోజకవర్గంలోని గోకవరం మండలం అచ్యుతాపురంలో అస్సాగో పరిశ్రమపై కాంగ్రెస్ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్, జిల్లా కలెక్టర్, అస్సాగో ఇథైల్ ఆల్కహాల్ పరిశ్రమ యాజమాన్యాన్ని ప్రత్యర్థులుగా చేసి ఎన్జీటీ కేసు నమోదు చేసింది. దీన్ని జోనల్ బెంచ్‌కి బదిలీ చేసింది.

నిత్యాన్నదానానికి విరాళం

సామర్లకోట, సెప్టెంబరు 25: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన రావుల పండరీ నేత్ర హేమలత పేరిట రూ.50 వేల విరాళాన్ని హేమలత కుటుంబసభ్యులు ఆలయ సిబ్బందికి అందజేశారు. వారికి ప్రత్యేక దర్శనాలు, పూజలు, నంది మండపం వద్ద పండితులచే వేదాశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు.

గొంచాలలో ఎంఈవో తనిఖీ

సామర్లకోట, సెప్టెంబరు 25: మండలంలో గొంచాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో శివరామకృష్ణయ్య తనిఖీ చేసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల మేధస్సును పరిశీలించారు. హెచ్ఎమ్ బీఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయ ట్రస్టీ పూజలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 25: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయాన్ని హైదరాబాదు చార్మినార్ మహాలక్ష్మి ఆలయ ట్రస్టీ శశికళ సందర్శించి అపర్ణాదేవిని దర్శించుకుని కుంకుమపూజలు చేయించుకున్నారు. ఆలయ అర్చకుడు ఆకోండి ప్రభాకరశాస్త్రి క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించారు. అమ్మవారి ఫోటోను అందజేశారు.